

ఇబ్రహీంపట్నం ఎంపీవో సస్పెన్షన్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎంపీవోగా పనిచేస్తున్న ఎ.వి.రామకృష్ణరాజు సస్పెండ్ అయ్యారు. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, డబ్బా గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్ల క్లస్టర్ అధికారిగా రామకృష్ణ రాజు విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 18న కలెక్టర్ సత్యప్రసాద్ మండలంలో ఆకస్మిక తనిఖీ నేపథ్యంలో ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు అయ్యాడు. ఈ నేపథ్యంలో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పరామర్శ

జగిత్యాల రూరల్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లా రాజన్న, వెల్దుర్తి గ్రామానికి చెందిన బుర్ర సాగర్‌లు అనారోగ్యంతో బాధపడుతుండగా సోమవారం మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బాధితులను పరామ ర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు బుర్ర ప్రవీణ్, కార్యకర్తలు ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అర్బన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన గౌరిశెట్టి చంద్రశేఖర్ అనే దివ్యాంగుడు కలెక్టర్ కార్యాలయం ముందు తన ద్విచక్రవాహనంపై కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. ఆసరా పింఛను 4 వేల నుంచి 6 వేలకు పెంచాలని కోరాడు. ఉచిత బస్సు ప్రయాణం, దివ్యాంగులందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశాడు. రాజకీయాలలో 10శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం గేట్ వద్ద ప్లకార్డు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశాడు. జిల్లాలోని వికలాంగులు స్వచ్ఛందంగా వచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన అన్నారు.

నిధులు వచ్చేశాయి..

- ఐదు మున్సిపాలిటీలకు రూ.122.50 కోట్లు విడుదల
- ఇందులో జిల్లా కేంద్రానికి రూ. 62.50 కోట్లు కేటాయింపు
- మౌలిక వసతులకు ప్రాధాన్యం
- కలెక్టర్ ఆమోదం పొందగానే టెండర్లు



జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీలకు కొంత మేర ఊరట కలిగింది. తెలంగాణ రైజింగ్ విజన్-2027లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ. 122.50 కోట్లు విడుదల చేసింది. ఒక్కో మున్సిపాలిటీకి రూ.15 కోట్ల చొప్పున కేటాయించింది. ఇందులో జగిత్యాల మున్సిపాలిటీకి అధికంగా రూ.62.50 కోట్లు విడుదల చేసింది. నిధుల విడుదల పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలోని అయిదు మున్సిపాలిటీలలో అనేక సమస్యలు తిష్టవేశాయి. సరియైన మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడం వల్ల నీరు వీధుల్లో, నివాసాల మధ్య పారుతోంది. అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. నిధుల రాకతో సమస్యలు కొంత మేర పరిష్కారం కావడానికి అవకాశం ఉంది.

ఒక్కో మున్సిపాలిటీకి రూ.15 కోట్లు

జిల్లాలోని ఒక్కో మున్సిపాలిటీకి రూ.15 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందులో కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున మొత్తంగా నాలుగు మున్సిపాలిటీలకు కలిపి రూ.60 కోట్లు నిధులు విడుదల అయ్యాయి. జిల్లా కేంద్రమైన జగిత్యాల మున్సిపాలిటీకి రూ.62.50 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. జిల్లా కేంద్రం సమీపంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రహదారులు, శ్మశాన వాటికలు, కరెంటు స్తంభాలు, ఓపెన్ జిమ్‌లు, మురికి కాలువలు తదితర అభివృద్ధి పనులను చేపట్ట డానికి ప్రణాళికలు రూపొందించారు.

2026 మార్చి నాటికి పనులు పూర్తి

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలున్నాయి. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధినిధి పథకం (యూఐటీఎస్) కింద ప్రభుత్వం రెండు నెలల క్రితం ప్రతిపాదనలు స్వీకరించింది. సంబంధిత ప్రతిపాదనల నిధులను తాజాగా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

చేపట్టాల్సిన పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు కలెక్టర్ సత్యప్రసాద్ ఆమోదం కోసం పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం పొందగానే టెండర్లు పిలవనున్నారు. వెంటనే పనులు ప్రారం భించి 2026 మార్చి నాటికి పనులను పూర్తి చేయాల్సి ఉంది.

బల్దియాలకు మహర్దశ

జిల్లాలోని మున్సిపాలిటీల్లో డ్రైయి నేజీలు, అంతర్గత రహదారులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పార్కులు, ఓపెన్‌జిమ్‌లు అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. విలీన గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో

మిగతా 8వ పేజీలో..

మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంక్షేమశాఖ మంత్రి



మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత పనులను సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు.

డ్రా పద్ధతిన మద్యం లైసెన్స్‌దారుల ఎంపిక



డ్రా తీస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల టౌన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్‌లో సోమవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మద్యం దుకాణాలకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో డ్రా నిర్వహించారు. జిల్లాలో మూడు సర్కిళ్ల పరిధిలో 71 మద్యం దుకాణాలు ఉండగా 1,966 దరఖాస్తులు వచ్చాయి. జగిత్యాల సర్కిల్ పరిధిలో 32, ధర్మపురి సర్కిల్ పరిధిలో 14, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో 25 షాపులు ఉన్నాయి. 71 మద్యం దుకాణాల్లో ఎస్సీ సామాజిక వర్గానికి 8, గౌడ సామాజిక వర్గానికి 14 ఓపెన్ కేటగిరిలో 49 మద్యం దుకాణాలను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపికైన నిర్వాహకులు డిసెంబరు1 నుంచి కొనసాగుతారని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

-సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి శ్రీకాంత్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జగిత్యాల జిల్లా నాలుగవ మహాసభల రెండవ రోజైన సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బరితెగించి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. యజమానుల లాభాల కోసం కార్మికుల శ్రమను మరింత దోచుకోవడానికి 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కోరలు లేని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని తెలిపారు. దీని ఫలితంగా దశాబ్దాల తరబడి సాధించుకున్న కార్మికుల హక్కులు నశిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కోట్లాది మంది కార్మికులు ఈలేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తున్నారన్నారు. తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుగ్గిల్ల స్వప్న, బొర్ర శేఖర్, తునికి శ్యాం, నర్సవ్వ, జ్యోతి, వాజిద్, మహ్మద్, స్వప్న ఆంజనేయులు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక సందడి
భక్తుల ప్రత్యేక పూజలు 7

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు
ఎస్పీ అశోక్ కుమార్ 8

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
డీఆర్‌డీవో పీడీ రఘువరన్ 8

విద్యార్థినికి అభినందన

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేజీఆర్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వొడ్నాల వైష్ణవి జాతీయస్థాయి గణిత పోటీ ఐఓక్యూఎం-2025లో ప్రతిభ కనబర్చి, రీజనల్ మ్యాథమెటికల్ ఒలంపియాడ్(ఆర్‌ఓఎం) అర్హత సాధించిందని పాఠశాల డైరెక్టర్ క్యాతం గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సనత్‌కుమార్‌లు తెలిపారు. ఆర్ఎంఓలో సైతం ఆమె ఉత్తమ ప్రతిభ కనబర్చడానికి అవసరమైన పూర్తి మద్దతు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్యాతం గంగారెడ్డి, ప్రిన్సిపాల్ సనత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శారదతో పాటు ఉపాధ్యాయ బృందం వైష్ణవిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు బొమ్మల వితరణ

కొడిమ్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం అదే గ్రామానికి చెందిన ఏగుర్ల గణేష్‌మౌనిక దంపతులు 12వేల రూపాయల విలువ గల బొమ్మలను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ఇన్‌చార్జ్, సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, పద్మ, స్నేహలత, వసంత, పుష్పలత పాల్గొన్నారు. బొమ్మలను అందించిన దాతలకు అంగన్‌వాడీ టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఏవో హకీంకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో హకీంకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో హకీంను కలిసి సమస్యలను విన్నవించారు. గత 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న వంట కార్మికులను పలు ప్రాంతాల్లో చిన్నా చితక కారణాలతో, డ్వాక్రా గ్రూపుల పేరుతో తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్ల బిల్లులు ఇప్పించాలన్నారు. అల్పాహారం బిల్లులు వెంటనే విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం కింద కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని, స్లాట్ రేట్లు పెంచాలని, నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్మికులకు పని భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులివ్వాలని, తహసీల్దార్ల ద్వారా ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేశ్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు శారద, జయశ్రీ, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సారంగాపూర్, అక్టోబర్, 27 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సారంగాపూర్ ఎస్సై గీత అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, రూరల్ సీఐ సుధాకర్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల పాఠశాలలో పోలీస్ కళాబృదంచే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమాజంలో జరుగుతున్న మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలు, గంజాయి, పోలీస్ చట్టాలు, షీ టీం సేవలు వంటి కళాబృందం చేత ఆట పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ఉపాధ్యాయినిలు, పలువురు విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి




వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ రామకృష్ణారావులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీసీకి కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. వచ్చే రెండు రోజుల పాటు తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయన్నారు. రెండు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో రఘువరన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, ఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

రాయికల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ద్వారా ఒక్కో రైతు నుంచి 18 క్వింటాళ్ల మాత్రమే మొక్కజొన్న కొనుగోలు చేస్తామనే నిబంధన సడలించాలని కాంగ్రెస్ యూత్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించేందుకు మొక్కజొన్న కొనుగోలు చేయడం శుభ పరిణామమన్నారు. ఒక్కో రైతు ఎకరానికి దాదాపు 30 క్వింటాళ్ల వరకు మొక్కజొన్న పంట పండిసాడన్నారు. ప్రభుత్వం కేవలం 18 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తే మిగతా ధాన్యాన్ని ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు జకిలేటి హరీష్‌రావు, ఇద్దాం సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలిగా సులోచన



జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)! సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలిగా ఇందూరి సులోచన ఎంపికయినట్లు రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ తెలిపారు. జిల్లా మహా సభలలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శిగా కొమటి చంద్రశేఖర్, కోశాధికారిగా వెంకటాచారి, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎ.రజిత, ఎంఏ చౌదరి, జంగిలి ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శులుగా మెట్టు మమత, సనీల్, కుంచం శంకర్‌లతో పాటు ఎనిమిది మంది ఎన్నికయినట్లు ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


దేశ్పాల్ శోభ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ మండలం, ఉప్పర పల్లి గ్రామానికి చెందిన దేశ్పాల్ శోభ నాలుగు రోజులక్రితం తన చిన్నకూతురుకు వద్దకు వచ్చి అదృశ్యం అయింది. ఈ మేరకు కేసు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డెలివరీ అయిన తన చిన్న కూతురు చూడడానికి శోభ వచ్చింది. సోమవారం ఉదయం ఏరియా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పట్టణంతోపాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శోభ పెద్ద కూతురు గీత ఇచ్చిన ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ కరుణాకర్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712670773, 8712574726 నంబర్లకు సమా చారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నాగుల మల్యాల శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో నాగులమల్యాలకు చెందిన చేకూరి సతీష్(30) మృతిచెందాడు. కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. నాగుల మల్యాలకు చెందిన సతీష్ గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని బావుపేటనుంచి బైక్‌పై ఇంటికివస్తున్న క్రమంలో నాగుల మల్యాల శివారులోని మూలమలుపు వద్ద బైక్‌అదుపుతప్పి చెట్టును ఢీకొం ది. దీంతో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు.

కార్మికుల పిల్లలకు కేంద్రం చేయూత



- ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్
- పోస్టుమెట్రిక్ దరఖాస్తులకు 31 వరకు గడువు

చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పిల్లల విద్య కోసం కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోంది. 1వ తరగతి నుంచి బీటెక్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను. వెయ్యి రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు అందజేస్తోంది. పోస్టుమెట్రిక్‌కు సంబంధించిన ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఏఎంఎస్, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తును చేసుకోవాలి.

బీడి కార్మికులు, ఐవోఎంసీ, ఎల్ఎస్‌డీఎం కార్మిక కుటుంబాలకు చేయూత..

బీడి కార్మికుల పిల్లలతోపాటు ఐరన్ ఓర్, మాంగనీస్ ఓర్, లైంస్టోన్ మైన్స్, డోలోమైట్, మైకా మైన్స్, సినీ కార్మికుల కుటుంబాల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. 1వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులకు వెయ్యి నుంచి 25 వేల రూపాయల వరకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో నేరుగా విద్యార్థుల ఖాతాలకే నగదును బదిలీ చేస్తారు.

దరఖాస్తు.. అర్హతలు..

విద్యార్థులు ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో రెగ్యులర్ పద్ధతిలో పాసై ఉండాలి. సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులు అనర్హులు. దూర విద్యను అభ్యసించే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. ఈ నెల 31 లోగా దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులకు 3 వేల రూపాయలు, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు 6 వేలు, బీటెక్, ఎంబీఏఎస్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ఏడాదికి 25 వేల రూపాయల ఉపకార వేతనం అందుతుంది. ప్రభుత్వ అనుమతి ఉన్న కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు. బీడి కార్మికులు, మైన్ కార్మికుల వేతనం 10 వేలలోపు ఉండాలి. సినీ కార్మికుల వేతనం నెలకు ఎనిమిది వేల రూపాయలు ఉండాలి. కార్మికుల గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత మెమో, తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.

నా కొడుకు మృతికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలి

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు ఆత్మహత్య చేసు కోవటానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీకి చెందిన శీలం రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో కోరా రు. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవటానికి కారణమైన వారిపై మంథని పోలీసులకు ఫిర్యాదుచేసి నెలలుగడిచినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలే దని వాపోయారు. శ్రీపాదకాలనీలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2024 డిసెంబర్ 6న జరిగిన గొడవ నేపథ్యంలో తన కొడుకు పై ఫిర్యాదు మేరకు మంథని ఎస్ఐ రమేష్ కొట్టడంతో అవమానభారంతో డిసెంబర్ 8న ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. తాము గమ నించి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా 2025 సెప్టెంబరు 19న రాజ్‌కుమార్ మృతి చెందినట్లు తెలిపారు. రాజ్‌కుమార్ మృతికి పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుండా పాపారావు, మూల పురుషోత్తంరెడ్డిల ఒత్తిడేకారణమని ఆరోపించారు. వారిపై పోలీసులు చర్య లు తీసుకొని న్యాయంచేయాలని ఆమెపోలీసు ఉన్నతాధికారులను కోరారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి తండ్రీ, కొడుకుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటుపాఠశాల నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి ఐదేళ్ల వయసు ఉన్న విద్యార్థి ప్రణయ్, తండ్రి రాజు సోమవారం పక్కనే ఉన్న మురుగు నీటి కాల్వలో పడిపోయారు. విద్యార్థి, తండ్రికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామంలోని రాజు కొడుకు ప్రణయ్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. కొడుకు తీసుకుని బైక్‌పై వెళ్తున్న రాజు ఎదురుగా బస్సు రావడంతో రోడ్డు పక్కన ఆగాడు. కాలు కింద పెట్టడడం వల్ల అదుపు తప్పి మురుగు నీటి కాల్వలో పడిపోయారు. గమనించిన వాహనదారులు కాల్వలోని తండ్రీకొడుకులను బయటకు తీయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వెండి నాణేలపై అధికారుల విచారణ


వెండి నాణేలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జూలపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో వెండి నాణె ములు లభ్యమైనట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. చీమలపేట గ్రామానికి చెందిన తొంటి రాజు పాతఇంటిని బ్లేడ్ ట్రాక్టర్‌తో సహాయంతో చదును చేస్తుండగా 10వెండి నాణె ములు లభ్యమైనట్లు అధికా రులు పేర్కొన్నారు. సోమ వారం గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు వాటిని స్వాధీనం చేసు కున్నారు. ఈ నాణెములు 1925సంవత్సరం నిజాంప్రభువు పాలనలో ముద్రించినట్లు ఆధారాలు ఉన్నట్లు అదికారులు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, గిర్దవర్ భవానిప్రసాద్, పోలీసులు అజీమ్ పలువురు గ్రామస్థులు ఉన్నారు.

ఎస్‌యూ స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాత వాహన విశ్వవిద్యాలయం లో వచ్చేనెల7న నిర్వహిం చనున్న 2వ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు యూని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆహ్వాన పత్రిక అందజే శారు. సోమవారం హైదరా బాద్‌లో గవర్నర్‌ను కలి శారు. స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని పనులూ దాదాపు పూర్త వుతున్నాయని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియం త్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): పాతకక్షల నేపథ్యంలో హత్యచేసిన నిందితుడు మహేష్‌కు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయ మూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. జగి త్యాల పట్టణం హనుమాన్‌వాడకు చెందిన తోటశేఖర్, బీట్‌బజార్ చెందిన సామాండ్ల మహేష్‌కు పాతగొడవలు ఉండేవి. ఈ నేప థ్యంలో 2023అక్టోబరు 16న శేఖర్‌కు అతిగా మద్యం తాగించి మహేష్ కత్తితో పొడిచి హత్యచేశాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు జగిత్యాలటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పిపి మల్లికార్జున్, అప్పటి ఇన్విస్టిగేషన్ ఇన్స్‌పెక్టర్ కిషోర్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసి దూషించిన కేసులో నిందితుడైన ప్రశాం త్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4,200 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్ లావణ్య తీర్పు వెలువరించారు. జగిత్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన మారంపెల్లి లక్ష్మణ్‌ను 2022 నవంబర్ 13న ప్రశాంత్ అనేవ్యక్తి మద్యం మత్తులో దూషించి దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జగిత్యాలరూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఏపీపీ, కోర్టుడ్యూటి అధికారు లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన ఏపీపీ రాజేష్, ఎస్సై అనిల్, సీడీవో నాగరాజు, సీఎంఎస్ ఎస్సైని ఎస్పీ అభినందించారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

- బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు

జగిత్యాల టౌన్, అక్టోబర్, 27 (ఆంధ్రజ్యోతి): మైనర్‌బాలికపై అత్యాచారం కేసులో నింది తుడికి 20ఏళ్ల కఠినకారాగార జైలుశిక్ష, రూ.10 వేల జరిమానాతోపాటు బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పుచెప్పారు. 2023లో కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌పరిధిలో కట్కూరిఅశోక్ అనేనిందితుడు బాలికను అత్యాచారంచేసిన ఘటనలో పోక్సో చట్టం కిందకేసు నమోదుచేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్లు కృష్ణకుమార్, కిషోర్ రమణమూర్తి కేసు విచారణచేసి ఫాస్ట్ ట్రాక్‌స్పెషల్‌కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పీపీ, కోర్టుడ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా సోమ వారం ప్రధానన్యాయమూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడడంలో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్విస్టిగేషన్ ఆఫీ సర్ ఇన్స్‌పెక్టర్‌లు కృష్ణకుమార్, కిషోర్, రమ ణమూర్తి, సీఎంఎస్ ఎస్సైశ్రీకాంత్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆదిత్య(ఫైల్)

బోయినపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలకేంద్రంలో ఇంటర్ విద్యార్థి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. బోయిన్‌పల్లికి చెందిన పిట్టల మల్లేశం కుమారుడు ఆదిత్య(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి పండుగకు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన ఆదిత్య సెలవులు ముగిశాక హాస్ట ల్‌కు వెళ్లలేదు. కుటుంబసభ్యులు హాస్టల్‌కు వెళ్లాలని ప్రాధేయపడ్డారు. ఆదిత్య హాస్టల్‌కి వెళ్లడం ఇష్టం లేక ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సోమవారం ఉదయం గ్రామంలోని ఓ రైతు పొలం వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆసుప త్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. తండ్రి మల్లేశం ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మనోజ్(ఫైల్)

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ రోడ్డుకు చెందిన దామ మనోజ్(28) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. దామమనోజ్ అనేయువకుడు తన స్నేహితు డైన పుప్పాల మహేష్‌తో ద్విచక్ర వాహనంపై ఐబీ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తుండగా ఆవును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు. అదే సమ యంలో అటుగావస్తున్న లారీ దామ మనోజ్‌పై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మహేష్ స్వల్పగాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. కాగా మనోజ్‌కు సోమవారం వివాహ విషయమై అమ్మాయి తరపు వారితో మాట్లాడాల్సి ఉండగా అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మనోజ్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం లో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీవిద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన వేములవాడ అక్షయ్‌సాయి(18) అనేయువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తనస్నేహితుడిని తీసుకరావడానికి హుజూరా బాద్ నుంచి రంగాపూర్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జమ్మికుంట రోడ్‌లోని గెలాక్సీ సూపర్‌మార్కెట్ వద్ద మున్సిపల్ ట్రాక్టర్ డివైడర్లలో మట్టిని పోయడానికి ఆపాడు. ఈ క్రమంలో అక్షయ్‌సాయి ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారిం చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కాలువలో పడి ఒకరి మృతి

కోనరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట శివారులోని కల్వర్టు కింద ఉన్న కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నబోనాల గ్రామానికి చెందిన గోస్కుల పరశురాములు (42) ఆదివారం కోన రావుపేట మండల కేంద్రంలోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మల్కపేట గ్రామ శివారులో పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికాడు. పోలీసులు అతని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని బస్సు ఎక్కించి పంపించారు. మల్కపేట శివారులో బస్సు దిగి కింద పడుతూ వెళ్లాడు. మల్కపేటలో ఉన్న తల్లి కనకవ్వ కుటుంబ సభ్యులు రాజు ఎంతకు ఇంటికి తిరిగిరాకపోవడంతో సోమవారం ఉదయం వెతుకు తుండగా మల్కపేట శివారులోని బ్రిడ్జికింద ఉన్న కాలువలో పడి మృతిచెందినట్లు గుర్తించారు. ఈవిషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డికి తల్లికనకవ్వ మల్కపేటశివారులోని బ్రిడ్జికాలువలోపడి మృతి చెందాడా?, ఇంకేమన్నా కారణాలు ఉన్నాయా అనే విషయంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాంచంద్రాపూర్‌లో చోరీ

- నాలుగు తులాల బంగారం అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర చారి

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామంలో పట్ట పగలు చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల-సిద్ధిపేట ప్రధానరహదారి పక్కన ఇట్టి రెడ్డి రాజిరెడ్డి ఇంట్లో సోమవారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటితాళం పగల గొట్టి బీరువాలో ఉన్న 4తులాల బంగారం ఎత్తుకె ళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్ఐ ఉపేంద్ర చారి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు.

రేషన్ దుకాణాల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

- ఇబ్బందులు పడుతున్న డీలర్లు, లబ్ధిదారులు


ఇబ్రహీంపట్నం మండలంలోని రేషన్‌దుకాణంలో పురుగులు పట్టిన దొడ్డు బియ్యం సంచులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని పలు రేషన్‌దుకాణాల్లో దొడ్డుబియ్యం ముక్కిపోతున్నాయి. ప్రభుత్వం గత ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పథకం ప్రారంభించిన నేపథ్యంలో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. అయితే మార్చి నెలలో అందజేసిన దొడ్డు బియ్యం కొన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులు తీసు కోకపోవడంతో మిగిలిపోయాయి. మండలం లోని 22రేషన్ దుకాణాల్లో సుమారుగా 80క్వింటాళ్ల దొడ్డు బియ్యం మిగిలిపోయాయి. అయితే మిగిలిపోయిన బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు వాపసు తీసు కోకపోవడంతో రేషన్‌దుకాణాల్లో ముక్కి పోతున్నాయి. బియ్యం సంచులకు పురు గులు పట్టి అవి కాస్త ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం సంచులకు సోకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల రేషన్ డీలర్లు కోరుతున్నారు.

టెండర్లు పిలుస్తాం..

- వరప్రసాద్, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం



రేషన్ దుకాణాల్లో మిగిలిపో యిన బియ్యానికి ప్రభుత్వం టెండర్లు పిలుస్తుంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు సదరు బియ్యానికి మార్కెట్ ధర చెల్లించి తీసుకువెళ్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిరేషన్ దుకాణాల్లో మిగిలి పోయిన దొడ్డు బియ్యానికి ఈ వారంలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గూడ హరికృష్ణ డిసెంబరు 14, 2023లో ఇంటికి తాళంవేసి తనసొంత గ్రామం బొమ్మకల్‌కి వెళ్లాడు. డిసెంబరు 19, 2023న హరికృష్ణ పనిమనిషి ఇంటిని శుభ్రం చెద్దామని ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే యజమానికి విషయం తెలపగా, హరికృష్ణ ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో రూ.52వేలు దొంగలించారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరుపరి చారు. హుజూరాబాద్ కోర్టు కానిస్టేబుల్ మహ్మద్ యూసుఫ్ కోర్టులో సాక్షులను ప్రాసిక్యూషన్ తరుపున పీపీ రమాఉపేందర్ కేసును వాదించగా, జడ్జీ పద్మసాయిశ్రీ సోమవారం నింధితుడికి ఒక సంవత్సరం 8 నెలల శిక్ష విధించారు.

హుజూరాబాద్‌లో కొండచిలువ కలకలం


రోడ్డుపై నుంచి వెళ్తున్న కొండచిలువ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరా బాద్ పట్టణంలో సోమవారం రాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని లక్కీ వైన్స్‌వద్ద కొండచిలువ రహ దారి మీదకు వచ్చింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కొండచిలువను పక్కనేఉన్న అటవీప్రాంతంలో వదిలి పెట్టారు.

కొండ చిలువను చంపిన కోతులు..

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో కోతులు అన్ని కలిసి ఓ కొండ చిలువను చంపేసి వాటి ఐక్యమత్యాన్ని చాటాయి. సోమవారం గ్రామానికి చెందిన చొప్పరి రవి ఇంటి పరిసరాల్లోకి కొండచిలువ వచ్చింది. సుమారు అది ఏడు అడుగుల పొడవు ఉంది. చెట్టుపై ఉన్న ఓ కోతిపిల్లను పట్టుకుని మెల్లమెల్లగా మింగింది. ఈ క్రమంలో చుట్టు పక్కల ఉన్న కోతుల గుంపు దానిని బెదిరిస్తున్నా కొండ చిలువ కోతిపిల్లను వదలకుండా పూర్తిగా మింగే సింది. దీంతో ఆవేశంలో ఉన్న కోతులన్నీ కలిసి ఆ కొండ చిలువను కొరికి చంపే శాయి.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


బూరారం(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బావు పేటలో రాజస్థాన్ లోని నాగోల్ జిల్లా బర్నెల్‌కు చెందిన బూరారం(32) అనే కూలీ సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్త పల్లి సీఐ బిల్లకోటేశ్వర్ తెలిపారు. బూరారం సాయిశంకర్ గ్రానైట్స్ కటింగ్‌ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నాడని, కుటుంబ కల హాలతో అద్దెకు ఉంటున్న రేకులషెడ్డులో ఉరేసుకున్నాడని పేర్కొన్నారు. టేకేదార్ హీరాలాల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు


రాజన్న ఆలయంలోని ఫ్లైఓవర్‌ను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయఅబివృద్ధి, విస్తరణపనులు ఊపందుకు న్నాయి. ప్రధాన ఆలయంలోని భక్తులు శ్రీస్వామి వారి దర్శనం కోసం వెళ్లేందుకు ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ క్యూలైన్‌లను సోమవారం తొలగించారు. ఉత్తరద్వారం వైపు నల్లాలసమీపంలో ప్రాకారం తొలగించడంతో ఎక్స్‌కవే టర్ ఆలయంలోకి ప్రవేశించింది. దీంతో క్యూలైన్‌లను మిషన్ సహాయంతో వేగంగా తొలగించారు.

సెల్ ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం విని యోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోనును కనుగొని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన బాధితుడు నిమ్మల నరేశ్‌కు సోమవారం అప్పగించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. నరేశ్ గ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోయిందని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బ్లూకోర్టు కానిస్టేబుల్ సాయి విహార్, హోంగార్డు శంకర్ సెల్‌ఫోను లోకేషన్‌ను పసిగట్టి బాధితుడు నరే శ్‌కు అప్పగించామని పేర్కొన్నారు. సెల్‌ఫోనును గుర్తించడంలో కృషిచేసిన కానిస్టేబుల్ సాయివిహార్, హోంగార్డు శంకర్‌లను ఎస్ఐ రాహుల్‌రెడ్డి అభినందించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలకు అధికారయంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కరీంనగర్ కేంద్ర శాఖ కలిగిన అర్బన్ బ్యాంక్‌కు జగిత్యాల, గంగాధరలో రెండు బ్రాంచ్‌లు ఉండగా, ఇటీవల గంగాధర బ్రాంచ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత ఎన్నికల్లో కరీంనగర్, జగిత్యాల సభ్యులకే ఓటు హక్కు లభించింది. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,282మంది ఓటర్లకు కరీంనగర్‌లో 7వేలు, జగిత్యాలలో 2వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 1న నిర్వహించే పాలకవర్గ ఎన్నికల్లో కరీంనగర్ ఓటర్ల కోసం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 24 పోలింగ్ కేంద్రాలు, జగిత్యాల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్ నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 1న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జరిగే పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ల కోసం క్యూలైన్లతోపాటు మంచినీటి వసతి, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారీబందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేములవాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హన్మాజిపేట గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై వెంకట్రాజం సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేల210 నగదుతోపాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం హెచ్చరించారు.

పరిహారం అందేనా?

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోతున్న గంగాధర మండల రైతులు
- మార్కెట్ విలువ మేరకు పరిహారం అందించాలని నిర్వాసితుల డిమాండ్
- ఇప్పటికి ఆరు గ్రామ సభలు
- ఎటూ తేల్చని అధికారులు



గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాల రైతులు నాలుగు ప్రాజెక్టులకు తమ జీవనాధారమైన భూములను ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందకపోవడంతో ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్తపల్లి, మనోహరబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి 2004లో ప్రతిపాదనలు పంపించారు. కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పరమల్యాల, గర్షకుర్తి, కాసారం గ్రామాల్లో భూమిని సేకరించారు. మూడేళ్ల క్రితమే ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన ఇతర



అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాయి

గ్రామాల రైతులకు పరిహారం అందించారు. గంగాధర మండలం రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గర్షకుర్తి, కాసారం గ్రామాల రైతులకు పరిహారం అందలేదు. భూమిలిచ్చి ఎనిమిదేళ్లు గడిచినా రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు పరిహారం అందించాలని వేడుకున్నా కనీస స్పందన కరువైంది. అధికారులు వచ్చి గ్రామంలో సభలు పెట్టి వెళ్లిపోతున్నారు. కాని పరిహారం విషయం తేల్చడం లేదు. నాలుగేళ్లుగా ఆరు గ్రామ సభలు నిర్వహించారు. ఇప్పటికీ పరిహారం అందించలేదు.

నాలుగు ప్రాజెక్టులకు భూములు

మండలంలోని రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు తమ విలువైన భూములను నాలుగు ప్రాజెక్టులకు అప్పగించారు. వరద కాలువ, డి4 డిస్ట్రిబ్యూటరీ కెనాల్, 1.1 టీఎంసీ కాలువ, కొత్తపల్లి మనోహరబాద్ రైల్వే లైనుకు భూములిచ్చారు. నాలుగు గ్రామాల్లో 50.19 ఎకరాల వ్యవసాయ భూములు, రంగరావుపల్లిలో 23, కాసారంలో 5 ఇళ్లు రైల్వే లైనులో పోతున్నాయి. భూములు కోల్పోతున్న రైతులు తమకు పరిహారం వస్తుందని ఇతర ప్రాంతాల్లో భూములు కొనేందుకు అడ్వాన్స్ ఇచ్చారు. మరి కొందరు అప్పులు తెచ్చి వేరే ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో తమపై అప్పుల భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

జీవనాధారమైన భూమి పోతుంది

– ద్యావ లింగారెడ్డి, రైతు, రంగరావుపల్లి



కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైను నిర్మాణంలో ఐదు ఎకరాల భభూమి పోతుంది. ఆ భూమే నా కుటుంబానికి జీవనాధారం. రెండు కరెంటు బావుల్లో ఒకటి పోతుంది. ఉన్నదాంట్లో భూమి, బావి మధ్య నుంచి లైను పోతుంది. రైల్వే లైను వేస్తే పైపు లైన్ వెయ్యరాదు. ఉన్న బావి నీరు వారుకోవడానికి వీలు ఉండదు. ఈ బావికి కూడా పరిహారం అందిస్తే మరో బాయి తవ్వించుకుంటా. అధికారులు రైతులను బాధపెట్టవద్దు.

నాలుగు ప్రాజెక్టులకు భూమి ఇచ్చా

– సందవేని అయిలయ్య, రైతు, రంగరావుపల్లి



గ్రామంలో చేపట్టిన నాలుగు ప్రాజెక్టులకు నా భూమి ఇచ్చా. వరద కాలువ, డి4, 1.1 టీఎంసీ, రైల్వే లైనులో ఐదు ఎకరాల పైచిలుకు వ్యవసాయ భూమి, ఎనిమిది గుంటల ఇంటి స్థలం, ఇల్లు పోయింది. సర్కారు ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తున్నా. డబ్బులు ఇస్తే వేరే ప్రాంతంలో భూమి తీసుకని ఇల్లు కట్టుకుందామనుకుంటున్న. పరిహారం ఎప్పుడిస్తరో చెప్పడం లేదు.

త్వరగా నష్టపరిహారం చెల్లించాలి

– ద్యావ మధుసూదన్‌రెడ్డి, రంగరావుపల్లి



గ్రామంలో రైల్వే లైనుతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. నా ఇల్లు కోల్పోతున్నాను. అధికారులు త్వరగా నష్టపరిహారం అందించాలి.

స్వదేశం చేరుకున్న గల్ఫ్ బాధితుడు



ఎయిర్‌పోర్టులో గౌరయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి రెండు నెలలుగా ఇబ్బందులు పడ్డ తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని గౌరయ్య సోమవారం స్వదేశానికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో కటుంబసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గౌరయ్యకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులను చూడగానే గౌరయ్య భావోద్వేగానికి గురయ్యాడు. తను రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయాన్ని ప్రస్తావిస్తూ తను స్వదేశానికి రావడానికి కృషి చేసిన కేటీఆర్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వాహనం ఏర్పాటు చేసి గౌరయ్యను బస్వాపూర్‌లో తన ఇంటికి చేర్చారు.

దుర్శేడ్ పాఠశాలలో చోరీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు ఆటవస్తువులు చోరీకి ఎత్తుకెళ్లారు. 5వ తరగతి గదిలో ఉన్న బీరువా పగలగొట్టి పిల్లలకు సంబంధించిన పుస్తలాలను చిందర వందర చేశారు. కొన్ని ఆటవస్తువులను దొంగిలించుకు పోయారు. పాఠశాల ప్రాంగణంలో నూనె పారబోశారు. పరిశీలించిన ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో రాణిస్తున్న సాహిత్య

- ఖేలో ఇండియా మహిళల విభాగంలో గోల్డ్‌మెడల్
- జాతీయ స్థాయి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ

మంథనిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఉదరి సాహిత్య జిల్లా, రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో రాణిస్తోంది. ఇటీవల నిర్వహించిన ఖేలోఇండియా అండర్-14 సైక్లింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి పలు విభాగాలలో ఛాంపియన్‌గా నిలిచింది. వచ్చేనెలలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. గుంజపడుగుకు చెందిన ఉదరి శ్రీనివాస్, సంధ్య దంపతుల చిన్నకూతురు సాహిత్య 5వ తరగతి చదువుతోంది. శ్రీనివాస్ దంపతులు కొన్నేళ్ళుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రితో కలిసి ఉదయం గ్రౌండ్‌కు వాకింగ్ వెళ్లగా అక్కడ కొందరు చిన్నారులు సైక్లింగ్ శిక్షణ తీసుకుంటున్నారు. సైక్లింగ్‌పై సాహిత్య ఆసక్తి చూపడంతో శిక్షణ ప్రారంభమైంది. అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు హైదరాబాద్‌కు చెందిన కోచ్ డాక్టర్ మాక్స్వెల్ ట్రివోర్ శిక్షణ ఇస్తున్నాడు. అతని శిక్షణలో సాహిత్య వివిధ విభాగలలో స్కూల్ గేమ్స్‌లలో మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించింది. సీఎం కప్‌లో సిల్వర్ మెడల్, రాజీవ్ స్పోర్ట్స్ అకాడమి నిర్వహించిన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. నవంబరు 1, 2వ తేదీలలో ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. సైక్లింగ్ శిక్షణకు ఒక్క సైకిల్ విలువ రెండు లక్షల వరకు ఉంటుందని, ప్రత్యేక గ్రౌండ్ అవసరం ఉంటుందన్నారు. సాహిత్యలో ఉన్న ప్రతిభను గుర్తించి కోచ్ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు.



సాహిత్య



సాహిత్య సాధించిన మెడల్స్

ఉత్సాహంగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అల్గునూరు వెలిచాల జగపతి రావు మెమోరియల్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఏ డివిజన్ వన్డేలీగ్‌కం నాకౌట్ క్రికెట్‌టోర్నీలో బడ్డింగ్ స్టార్స్ జట్టు కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుపై 16పరుగులు తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బడ్డింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 45ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 277పరుగులు చేసింది. ఈ జట్టు నుంచి జయరాం కశ్యప్ 121, అలంకృత్ అగర్వాల్ 52 పరుగులు తీశారు. కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టు నుంచి అఫ్రాజ్ గోరు 43 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కంబైన్డ్ డిస్ట్రిక్ట్‌జట్టు నిర్ణీతఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 261పరుగులు చేసి ఓటమి పాలైంది. జట్టునుంచి గణేష్ 74పరుగులు, డేవిడ్ కృపాల రాయి 43పరుగులు, జీఎస్‌కే రెడ్డి 50 పరుగులు సాధించారు. బడ్డింగ్ స్టార్స్‌జట్టు నుంచి ఉదయ్ కిరణ్ మూడు వికెట్లు తీసుకొని రాణించారు. ఈమ్యాచ్ నిర్వహణలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎంపైర్స్‌తోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, సభ్యులు మహేందర్‌గౌడ్, ఉపేందర్‌రావు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



121 పరుగులు సాధించిన జయరాం కశ్యప్



క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న బడ్డింగ్ స్టార్స్, కంబైన్డ్ డిస్ట్రిక్ట్ క్రీడాకారులు

శంభో.. శంకరా..

- భీమన్న ఆలయానికి కార్తీక సోమవారం రద్దీ
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో రమాదేవి



భక్తులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్న భీమేశ్వర ఆలయ ఆవరణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రంలో భక్తులు హర హర మహాదేవా.. శంభో శంకర.. నామ స్మరణతో భీమన్న ఆలయం మారుమోగింది. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా పనులు జరుగుతుండటంతో భక్తులు భీమన్న ఆలయానికి సోమవారం పోటెత్తారు. కార్తీక సోమవారంను పురస్కరించుకుని ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణ, ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. నటరాజు విగ్రహం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైల వద్ద భక్తులు బారులు తీరారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు భీమేశ్వర పాహిమాం అంటూ మొక్కులు చెల్లించుకుని వేడుకున్నారు. శ్రీస్వామి వారికి ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు అభిషేకాలు, గండ దీపంలో నూనె పోస్తూ గండాలు తొలగి పోవాలని వేడుకున్నారు. నూతనంగా నిర్మించిన షెడ్లలో చండీహోమం, సత్యనారాణ వ్రతాలు, లింగార్చనలు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కాగా అన్నదాన సత్రంపై అంతస్తులో ఏర్పాటుచేసిన నిత్యకళ్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అంతే కాకుండా కార్తీక సోమవారం సందర్భంగా శ్రీస్వామి వారితో పాటుగా అనబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చనలు ఆలయ అర్చకులు వైదికంగా చేపట్టారు.

భీమన్న ఆలయంలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో..

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా రాజన్న, భీమన్న ఆలయాలకు భక్తుల పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజన్న ఆలయ ఈవో రమాదేవి ఆలయంలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని ఉద్యోగులను ఈవో ఆదేశించారు.

భీమేశ్వర ఆలయంలో భక్తుల మొక్కులు..

వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భీమన్న ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు 4వేల 21మంది కోడెమొక్కులు, 48అభిషేక పూజలు, 11అన్నపూజలు, 89 నిత్య కళ్యాణ పూజలు, 2చండీహోమం, 11 సత్యనారాయణ వ్రతాలు, 6కుంకుమపూజలు ఒక్కటి లింగార్చన, మూడు వాహనపూజలు, 21 పెద్దసేవల, పల్లకిసేవల టికెట్‌లు భక్తులు తీసుకున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం గోదావరిమాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీసోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు.



కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు



కొండగట్టులో దీపాలు వెలిగించిన భక్తులు

అంజన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిదిలో సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకులు రఘు, ఆలయ సిబ్బంది అశోక్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ పోటీల్లో సుల్తానాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జెఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్14,17 బాలబాలికల విభాగంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 17ఏళ్ల విభాగంలో వైష్ణవి, సాత్విక, అండర్ 14లో దిశాంత్‌లు ప్రతిభ చూపి, ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం దివాకర్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్, ఉపాధ్యాయలు, తల్లితండ్రులు సోమవారం అభినందించారు.



క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి

- భక్తుల రద్దీ
- ప్రత్యేక పూజలు



ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వస్వామి, శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం నిర్వహించగా భక్తులు బిల్వార్చన చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది సేవలు అందించారు.

గోదావరి హారతి..

కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురివద్ద సోమవారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ విశేష పూజలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు.

రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రారంభానికి సిద్ధంగా క్రిటికల్ కేర్ యూనిట్

-త్వరలో పేదలకు అందుబాటులోకి అత్యవసర వైద్య సేవలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదలు అత్యవసర వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలోని ధరూర్‌క్యాంపులో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. 50కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌లో 50 పడకలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రానికి సమీపంలో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆసుపత్రిలో ఉన్న అన్ని వార్డుల్లో ఐసీయూలు, ఆక్సిజన్ పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రాంతంలోనే జిల్లా ప్రధాన ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు కాగా త్వరలో ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

క్రిటికల్ కేర్ యూనిట్‌లో వెంటిలేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుతో అత్యవసర సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో అత్యవసర వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది.



నిర్మాణం పూర్తయిన క్రిటికల్ కేర్ యూనిట్

● ఆధునిక ఆక్సిజన్ ప్లాంట్

క్రిటికల్ కేర్ యూనిట్‌కు అనుబంధంగా సమీపంలోని మాతా శిశు కేంద్రం ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం చేశారు. ఈ ఆక్సిజన్ ప్లాంట్ ద్వారా క్రిటికల్ కేర్ యూనిట్‌తో పాటు మాతా శిశు కేంద్రానికి భవిష్యత్‌లో నిర్మించనున్న ప్రధానాసుపత్రికి కావాల్సిన ఆక్సిజన్‌ను ఈ ప్లాంట్ ద్వారా సరఫరా చేసుకునే అవకాశం ఉంటుంది.

ఆక్సిజన్ ప్లాంట్ కెపాసిటీ 10 వేల లీటర్లు కాగా ఇప్పటికే మాతా శిశు కేంద్రంలోని అత్యవసర విభాగాలకు, క్రిటికల్ కేర్ యూనిట్‌లోని బెడ్‌లకు ఆక్సిజన్ ప్లాంట్ నుంచి ఆక్సిజన్ అందేలా ఏర్పాటు చేశారు.

● త్వరలో అందుబాటులోకి ..

-ఆసుపత్రి సూపరింటెండెంట్, నరేందర్



జిల్లా కేంద్రంలో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుతో జిల్లాలోని వారందరికి అత్యవసర వైద్యం అందు బాటులోకి వస్తుంది. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు కావసిన వైద్యులను అందు బాటులో ఉంచుతాం. వైద్యం అవసరం ఉన్నవారికి ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసుకుంటాం.

● మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జగిత్యాల పట్టణంలో వైద్యాన్ని మరింత మెరుగు పరచేందుకు మంత్రి లక్ష్మణ్ కుమార్ సహకారంతో కృషి చేస్తున్నా. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఉన్న మెడికల్ కళాశాలకు అనుగుణంగా 2 వందల కోట్లతో ప్రధానాసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. అత్యవసర వైద్యచికిత్స కోసం నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ త్వరలో ప్రారంభిస్తాం. జిల్లా కేంద్రంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

వరి కోత యంత్రం బ్లేడ్లు గుచ్చుకొని వ్యక్తి మృతి

బీర్‌పూర్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరి కోత యంత్రం బ్లేడ్లు గొంతులో గుచ్చుకొని కొల్వాయి గ్రామానికి చెందిన సూర రాజన్న అలియాస్ రాజేష్ (48) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన సూర రాజన్న, మంచిర్యాల జిల్లాకు చెందిన గుండ నర్సయ్య అనే ఇద్దరు వ్యక్తులు సోమవారం రాత్రి కొల్వాయి గ్రామంలోని ఒడ్డెర కాలనీ నుంచి బస్టాండ్ వద్దకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో కొల్వాయి గ్రామం నుంచి పెట్రోల్ బంక్‌లో వరి కోత యంత్రాన్ని పార్కింగ్ చేయడం కోసం డ్రైవర్ తాళ్ళధర్మారం వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న వరి కోత యంత్రాన్ని ద్విచక్రవాహం నడుపుతున్న నర్సయ్య గమనించి వెంటనే ముందుకు వంగి కింద పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుకాల కూర్చున్న సూర రాజేష్ వాహనంపై కూర్చొని ఉండడంతో వరి కోత యంత్రం బ్లేడ్ గొంతులో గుచ్చుకొని అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడు రాజన్నకు భార్య శైలజ, ఇద్దరు కూతుర్లు, ఒక్క కుమారుడు ఉన్నారు.

చేపల చెరువు తూము ధ్వంసం

సారంగాపూర్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగునూర్ గ్రామ సమీపంలో గల నాగుల కుంట చేపల చెరువు తూము, గేట్లు, సీసీ కెమెరాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. చెరువులోని చేపలు పూర్తిగా బయటకు పోయాయి. దీంతో గ్రామానికి చెందిన నరేలి మల్లేశం పిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గీత పేర్కొన్నారు.

నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలి

మల్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబరు 1న హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్‌మాదిగ పిలుపినిచ్చారు. మల్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్‌పై దాడి న్యాయవ్యవస్థ, దళిత సమాజంపై దాడి అని, దాడికి పాల్పడిన రాకేష్‌కిషోర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పారపు అశోక్, ముప్పారపు రామస్వామి, బెజ్జంకి చిన్నదుర్గయ్య, గుడిసె రవి, బల్కం మల్లేశంయాదవ్, టైటస్, శ్యామల, లక్ష్మి, రాజు, రాజనర్సయ్య పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

కొడిమ్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పయ్యపల్లి పాఠశాలలో విదులు నిర్వహించిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యం పదవీ విరమణ సోమవారం ఘనంగా జరిగింది. పాఠశాలలో పదవీ విరమణ పొందిన చిట్టంపల్లి సత్యంమాధవి దంపతులకు గ్రామస్తులు శాలువాలను కప్పి ఘనంగా సన్మానం చేసారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు సత్యం చేసిన సేవలను, విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



పోలీసు అధికారులతో ఎస్పీ అశోక్ కుమార్

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్ తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందే విధంగా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములతో కలిసి సందర్శించారు. పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీకి వచ్చిన ఎస్పీకి కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి, రామచంద్రులు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి స్టేషన్‌ను తనిఖీని జరిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కారం త్వరగా చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డు, జనరల్ డైరీ, ఆర్మ్ రూం, స్టోర్స్ లాకప్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి ఎస్ఐలు శ్రీధర్ రెడ్డి, నవీన్, కిరణ్ కుమార్, రాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బీర్‌పూర్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిం చారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఎస్సై రాజు మాట్లాడుతూ గంజాయి అమ్మకాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ మేఘశ్యామ్, సఖి సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ రఘువరన్

కోరుట్ల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో పీడీ రఘువరన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో పీడీ రఘువరన్‌లతో కలిసి మార్కెట్ చైర్మెన్ అంజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, మార్కెట్ వైస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని మెట్ల చిట్టాపూర్, ఆత్మనగర్, అల్లూసీతారామరాజు తండా, ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, అధికారులు ప్రారంబించారు.

●మల్యాల: తక్కళ్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొంపల్లె, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాలలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ తొట్ల చంద్రశేఖర్, సీఈవో మనోజ్ పాల్గొన్నారు.

●రాయికల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి అన్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రాయికల్, శివాజీనగర్, మహితాపూర్ గ్రామాల్లో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

●కథలాపూర్: మండలంలోని తక్కల్లపల్లి, బొమ్మెన, దూలురు గ్రామాలలో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మెన్ నారాయణ రెడ్డి ప్రారంభించారు.

●పెగడపల్లి: రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. సోమవారం పెగడపల్లి , నంచర్ల సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెగడపల్లి, నంచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను, సెర్ప్ ఆధ్వర్యంలో పెగడపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రాములు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి, నంచర్ల విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, మార్కెట్ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, గిర్దావర్ శ్రీనివాస్, ఏపీఎం రవివర్మ, సింగిల్‌విండోల సీఈవోలు గోపాల్ రెడ్డి, మధూకర్ పాల్గొన్నారు.

నిధులు వచ్చేశాయి..

(ఐదో పేజీ తరువాయి)

నిధులు ఖర్చు చేయనున్నారు. జగిత్యాల మున్సిపల్‌లో విలీనమైన టీఆర్ నగర్, మోతే, తిప్పన్నపేట, హస్నాబాద్, దరూర్‌లతో పాటు కోరుట్లలో విలీనమైన యెకిన్‌పూర్, మెట్‌పల్లిలో విలీనమైన ఆరపేట, వెంకట్రావుపేట గ్రామాలల్లో పలు అబివృద్ధి పనులు చేపట్టనున్నారు.

నూతన ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



మేడిపల్లి ఎంపీడీవో అంజుమను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

మేడిపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ద్వారా ఎంపికైన పలువురు ఎంపీడీవోలు సోమవారం ఆయా మండలాల్లో బాధ్యతలు స్వీకరించారు. మేడిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా అంజుమ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సుష్మ, ఎంపీవో నీరజ తదితరులు నూతన ఎంపీడీవో అంజుమకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

●ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా గణేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన మహమ్మద్ సలీమ్ సారంగాపూర్ ఎంపీవోగా బదిలీ అయ్యారు.

●బుగ్గారం: బుగ్గారం ఎంపీడీవోగా ఎం.సుమంత్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీవో అఫ్జల్‌మియా తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: మల్లాపూర్ ఎంపీడీవోగా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●పెగడపల్లి: పెగడపల్లి ఎంపీడీవోగా ప్రేమ్‌సాగర్‌రావు విధుల్లో చేరారు. ఈసందర్భంగా కార్యాలయ ఉద్యోగులు ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

●వెల్గటూర్: వెల్గటూర్ ఎంపీడీవోగా వెంకటప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

రాయికల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం సంఘం అధ్యక్షుడు ఏనుగు ముత్యం రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికలను సభ్యులకు సమర్పించారు. సంఘం ద్వారా సుమారు రూ.7 కోట్ల దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేశామని తెలిపారు. సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి, సంఘంలో డిపాజిట్లు పెడితే మరిన్ని సేవలు అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నాగుల మల్లయ్య, డైరెక్టర్లు కొమ్ము గంగరాజం, నేతుల లక్ష్మీనారాయణ, కోసరి మహేష్, మాజీ ఉప సర్పంచ్ అన్నవేణి వేణు, కార్యదర్శి ఎల్లాల చంద్రశేఖర్, సిబ్బంది రాజేష్, రంజిత్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

కొడిమ్యాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడిమ్యాల, మండలంలోని అప్పారావుపేట, కొండాపూర్ గ్రామాలలో సోమవారం ఈజీఎస్ అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో ఏయే పనులను ఎంపిక చేసుకోవాలనె అంశాలపై గ్రామ సభలను సంబందిత అధికారులు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు వంశీవర్దన్, స్వామి, ఏపీవో సతీష్, ఈసీ రమాపతి, టీఏలు శ్రీనివాస్, గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో పల్లకీసేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పెగడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. కార్తీక సోమవారం పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పెట్టి ప్రత్యేక పూజలనంతరం ఆలయం చుట్టూ భక్తులు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం మద్దులపల్లికి చెందిన కంబాల పోచయ్య లచ్చవ్వ, మహేష్ స్రవంతి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అర్చకులు గుండి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి అధ్యాపకుడికి అవార్డు

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ ఓర్సు రాయలింగు అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు లభించింది. తెలుగు అధ్యాపకులుగా పెద్దపల్లి జిల్లా మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) లో ప్రస్తుతం బోధన చేస్తున్నారు. ఈయనకు తెలుగ సాహిత్య భాష, సృజనాత్మక, విద్యా రంగంలో విశేషమైన ప్రతిభ కనబరచడం పట్ల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు లభించింది. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా ఈ నెల 26 న అందుకున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల అభివృద్ధికి రూ. 37.40 కోట్ల నిదులను కేటాయించడాని స్వాగతిస్తూ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, కొంత రాజం, పెరుమాండ్ల సత్యనారాయణ, నహీం, అన్నం అనిల్, ఎలిశెట్టి భూమ్ రెడ్డి పాల్గొన్నారు.

దళితుల నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్

మెట్‌పల్లిటౌన్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నవంబర్ 1న నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెటుపల్లి లక్ష్మణ్ కోరారు. సోమవారం పట్టణంలో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం కంటే తమకు ఏది ముఖ్యం కాదని, దళిత ఆత్మ గౌరవంను ఆటంకం కలిగితే ఎంతటి పోరాటనికి సిద్దంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు దయ్యాల హన్మంత్, ములుగు రామచంద్రం, రాజేందర్, మోహన్, శ్రీరామ్ దామోదర్, సంతోష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 34 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు దరఖాస్తులు ఇస్తారని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

సంవత్సరం దాటినా పారితోషికం రాలేదు

-కంప్యూటర్ ఆపరేటర్లు

ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి సంవత్సరం దాటుతున్నది. ఇప్పటి వరకు ప్రభుత్వం పారితోషికం ఇవ్వడంలేదు. జిల్లాలో రెండుకోట్ల రూపాయల వరకు కంప్యూటర్ ఆపరేటర్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. స్థానికంగా ఉన్న అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదు అంటున్నారు. నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే పారితోషికం చెల్లించాలి.

యునాని ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

-హైమద్, సామాజిక కార్యకర్త జగిత్యాల

జగిత్యాల పట్టణంలో ప్రభుత్వ యునాని వైద్యశాల ఏర్పాటు చేయాలి. ప్రజల ఆరోగ్యానికి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఉండే మందులు యునాని వైద్యంలో అందుబాటులో ఉంటాయి. అనేక ప్రాంతాలలో యునాని వైద్యశాలలు ఉన్నాయి. .ఇల్లా కేంద్రంలో ఈ ఆసుపత్రి ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కోరుట్ల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం వేముల లక్ష్మీపతి-లక్ష్మీదేవి మెరిట్ అవార్డు పౌండేషన్ కోరుట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లో రాణించడానికి ఉపయోగ పడే స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

'మాజీ మంత్రి కొప్పుల అరెస్ట్ అప్రజాస్వామికం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గొల్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమై వచ్చిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పోలీసులచే అరెస్ట్ చేయించడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో చేసిన రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి హరీష్ రావుకు సవాల్ విసరగా, సవాల్‌కు సిద్దపడి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కు చేరుకోగానే ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గొల్లపల్లి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్‌ను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిర చర్చకు రాకుండా చర్చకు సిద్దమైన ప్రతిపక్ష నాయకుడిని, బీఆర్‌ఎస్ శ్రేణులను నిర్బందించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకరయ్య, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు రవీందర్, బీఆర్ఎస్వీ మండల శాఖ అధ్యక్షులు ఆవారి చందు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు రాజేందర్,బీఆర్‌ఎస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ గంగాధర్, బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు కిషన్, మాజీ ప్రజా ప్రతినిధులు శ్యామ్, లక్ష్మీగంగారెడ్డి, రాజన్న, గంగారాజం, నాయకులు పుట్టపాక సత్తయ్య, జలేందర్ పాల్గొన్నారు.

●బుగ్గారం: మాజీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అరెస్టుపై బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గాలిపెల్లి మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలను దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న మోసాల నిలదీస్తున్న సందర్భంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అరెస్టు చేసిన సంధర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాలిపెల్లి మహేష్, మాజీ సర్పంచ్ మసర్తి రాజిరెడ్డి, సిరికొండ మాజీ సర్పంచ్ దాసరీ లచ్చయ్య, నాయకులు మూల శ్రీనివాస్ గౌడ్, ఎండి అబ్దుల్ రహమాన్, దాసర్తి పూర్ణచందర్ పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గొల్లపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ అవినాష్ ఖాతాదారులకు సూచించారు. సోమవారం గొల్లపల్లి యూనియన్ బ్యాంక్‌లో మండలంలోని ఇబ్రాజ్ పల్లె గ్రామానికి చెందిన ఇద్దరు ఖాతాదారులు ఇటీవల మృతిచెందగా ఒక్కోక్కరికి రూ.2 లక్షల బీమా సొమ్ము మంజూరవగా చెక్కులను నామినీలకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన మరో ఖాతాదారుడు ఓ ప్రమాదంలో అంగ వైకల్యం పొందగా పీఎంఎస్‌బీవై పథకం కింద మంజూరైన రూ.లక్ష చెక్కును బాధిత లబ్దిదారుడికి పంపిణీ చేశారు.

ఘనంగా 'మన అమ్మకు మన సారె'



ఆలయంలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ శైవ క్షేత్ర వనిత శక్తి మండల శాఖ ఆధ్వర్యంలో మన అమ్మకు మనసారె కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చీర, సారె, ఒడి బియ్యంతో అమ్మవారి నామ సంకీర్తనలతో ఊరేగింపుగా స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అర్చకులు సంకల్ప పూజలు నిర్వహించగా మహిళలు చీర, సారె, ఒడి బియ్యం సమర్పించారు. లోక కళ్యాణార్థం ప్రతి నెల ఒక ఆలయంలో ఈ అమ్మవారికి కార్యక్రమాన్ని చేస్తున్నట్లు మహిళలు తెలిపారు.